సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



అపార నష్టం

జిల్లాలో బుధవారం రాత్రి కురిసిన వర్షంతో పంటలకు అపార నష్టం సంభవించింది. పంట నీటమునగడంతో అన్నదాతలు కన్నీటిపర్యంతమయ్యారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,12,,480
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,130
మూడు శాతం జీఎస్టీతో	రూ.10,434
నవర (8 గ్రాములు)	రూ.83,434

గరిష్ఠం/కనిష్ఠం
34.1 /24.1

వాతావరణం

జిల్లాలో ఆకాశం శుక్రవారం మేఘావృత మయ్యే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 63 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఐదు బార్లకు 20 దరఖాస్తులు

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన బార్ పాలసీకి వ్యాపారుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. జిల్లాలో ఓపెన్ కేటగిరీ కింద 50.. గీత కులాలకు సంబంధించిన ఐదు బార్లకు గత నెల 30, ఈ నెల రెండో తేదీన నిర్వహించిన లాటరీ ప్రక్రియలో 22 మంది వ్యాపారులు దక్కించుకున్నారు. మిగిలిన 33 బార్లకు రీ నోటిఫికేషన్‌ను ఈ నెల మూడున జారీ చేశారు. ఆఫ్‌లైన్ / ఆన్‌లైన్ విధానాల్లో ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఆరు వరకు దరఖాస్తుల స్వీకరణ.. 15న లాటరీ డ్రా తీస్తామని అధికారులు ప్రకటించారు. అయితే స్వీకరణ గడువును మరో మారు పొడిగించినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు దాఖలు కాలేదు. జిల్లాలోని మిగిలిన 33 బార్లకు గానూ నగరంలో నాలుగు, కావలిలో ఒకటి మొత్తంగా ఐదింటికి 20 దరఖాస్తులే దాఖలయ్యాయి. మిగిలిన వేటికీ దరఖాస్తులేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరగడంతో మిగిలిన బార్లకు దరఖాస్తులు వేయించేందుకు బడా పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పాత మద్యం వ్యాపారులతో ఎక్సైజ్ అధికారులు చర్చిస్తున్నారు. మరో మూడు రోజుల్లో గడువు ముగియనుండటంతో ఏ మేరకు దాఖలవుతాయో వేచి చూడాలి.

నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా

- అనంతపురానికి ఆనంద్ బదిలీ



హిమాన్షు శుక్లా



ఆనంద్

నెల్లూరు రూరల్: జిల్లా నూతన కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆనంద్‌ను అనంతపురం కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. జిల్లాలో పనిచేసిన ఆయన 14 నెలల్లో రాజకీయ కారణాలతో బదిలీ అయ్యారు. స్వల్ప వ్యవధిలోనే మంచి పేరు తెచ్చుకున్నారు. జీఏడీలో ఐ అండ్ పీఆర్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న 2013వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ హిమాన్షు శుక్లా ఇక్కడ కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించనున్నారు. అసిస్టెంట్ కలెక్టర్‌గా విశాఖపట్నంలో.. సబ్ కలెక్టర్‌గా తిరుపతి, విజయవాడలో.. గుంటూరు జేసీగా.. పశ్చిమగోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్‌గా ఈయన పనిచేశారు.

పర్యాటకాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఉషశ్రీ

నెల్లూరు రూరల్: జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని జిల్లా పర్యాటక అధికారి ఉషశ్రీ కోరారు. బారాషహీద్ దర్గా వద్ద గల జిల్లా పర్యాటక కేంద్రంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆమె మాట్లాడారు. ఉదయగిరి దుర్గాన్ని ట్రెక్కింగ్‌కు అనుకూలంగా మారుస్తామని వెల్లడించారు. పరిశుభ్రతను మెరుగుపర్చి పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతామని చెప్పారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, సాంస్కృతిక.. వారసత్వ కోటలు, జలపాతాలు, ఎకో టూరిజం, స్థానిక వంటకాలు తదితరాలను ప్రోత్సహిస్తూ విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లు, సృజనాత్మక ప్రతిభ కలిగిన వారికి పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. ఫొటోలు హైరెజల్యూషన్ కలిగి జిల్లాలో తీసినవే అయి ఉండాలన్నారు. పాల్గొనాలనుకునే వారు ఈ నెల 20లోపు అందజేయాలని కోరారు. కమిటీని ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో స్క్రూటినీ చేసి విజేతలను ప్రకటించనున్నామని చెప్పారు. విజేతలకు బహుమతులను ఈ నెల 27న అందజేయనున్నామని, వివరాలకు 94936 68022, 77807 49802 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఏఎస్‌పేట గంధ మహోత్సవంపై సమీక్ష



ఆత్మకూరు: ఏఎస్‌పేటలోని ఖాజానాయబ్ రసూల్ దర్గా గంధ మహోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని తన కార్యాలయంలో ఆత్మకూరు ఆర్డీఓ పావని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గంధ మహోత్సవాన్ని ఈ నెల 18 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. మౌలిక వసతులను కల్పించాలని కోరారు. సరిపడా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. దర్గా ఈఓ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



మీడియా స్వేచ్ఛపై సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న నియంతృత్వ పోకడ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ కంటే దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. దారుణాలు, అక్రమాలను బయటపెడతారనే భయంతో పాత్రికేయులను హింసించడం తగదు. సీఎం స్థానంలో ఉండి వార్తలు రాసే వారిని భయపెట్టడం, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని బెదిరించి అరెస్ట్ చేయడం దారుణం. ఖబడ్దార్ అంటూ పాత్రికేయులను బెదిరించడం సమంజసం కాదు. ఎడిటర్ స్థాయి వారి ఇంటికి పోలీసులను పంపడం.. మళ్లీ కేసులు పెట్టడం.. మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చడం చంద్రబాబుకు తగదు. ఇలాంటి పాలనకు త్వరలోనే ప్రజలు సరైన సమాధానం చెప్తారు. – కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి



వ్యవస్థలను నాశనం చేశారు



రాష్ట్రంలో వ్యవస్థలన్నింటినీ సీఎం చంద్రబాబు నాశనం చేశారు. ప్రజాస్వామ్యానికి కీలకమైన పత్రిక స్వేచ్ఛపై కుట్రపూరిత కేసులు పెట్టడం హేయం. సమాజహితం కోరే పత్రిక రంగాన్ని ఆయనేమో వాడుకుంటున్నారు. వాస్తవాలు తెలిపే వారిపై కేసులు బనాయించడం, బెదిరించడం దుశ్చర్య. అక్రమాలను బయట పెట్టే వారిపై దాడి చేసేందుకు పోలీసులను సైతం వాడుకోవడం ఎంత వరకు సమంజసం. వాస్తవాలను తెలుసుకొని పరిపాలనను సరిదిద్దుకోవాల్సిన సీఎం.. ఇలాంటి పనులు చేయడాన్ని ఎవరూ అంగీకరించరు. ప్రతి వ్యవస్థను తనకు అనుకూలంగా మలుచుకోవడం చంద్రబాబుకు బాగా తెలుసు. ఇప్పుడున్న మీడియా, సోషల్ మీడియా దెబ్బకు ఆయనకు సరైన గుణపాఠం లభిస్తుంది.
– అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ మంత్రి

రామాయపట్నంపై నిర్దయ

చెప్పేదొకటి.. చేసేదొకటి అనే రీతిలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి తలపెట్టిన రామాయపట్నం పోర్టు నిర్మాణ తీరే దీనికి చక్కటి ఉదాహరణ. నాడు చకచకా పనులు సాగి, గతేడాది ఏప్రిల్ నాటికి మొదటి దశ పూర్తి కావాల్సిన ఈ నౌకాశ్రయం సర్కార్ నిర్లక్ష్య ధోరణి కారణంగా అతీగతీ లేకుండాపోతోంది. దీనిపై ఏ మాత్రం దృష్టి సారించకుండా.. రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో ప్రతి 50 కిలోమీటర్లకో పోర్టును ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. 70 శాతం పూర్తయిన దీనిపైనే శ్రద్ధ చూపని పాలకులు.. మిగిలిన వాటిని ఎలా నిర్మిస్తారు.. ఇదంతా బూటకమనే విషయం వారి చేష్టలతోనే స్పష్టమవుతోంది.

- పోర్టుపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం
- నత్తనడకన నిర్మాణ పనులు
- కాంట్రాక్ట్ సంస్థ మార్పుతో ఆర్నెల్ల పాటు ఎక్కడికక్కడే
- ఆపై ప్రారంభించినా.. ఊపందుకోని వైనం
- బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణానికే పరిమితం
- నీరుగారిన ఆశయం

కందుకూరు: రామాయపట్నం పోర్టును కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్కార్ హయాంలో దీని నిర్మాణ పనులు చకచకా సాగినా, ప్రస్తుతం అడుగు ముందుకు పడటంలేదు. నూతన ప్రభుత్వం కొలువుదీరాక.. అప్పటికే పనులు చేస్తున్న ఏజెన్సీని తొలగించడంతో ఆర్నెల్ల పాటు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆ తర్వాత చేపట్టినా, పనుల్లో వేగం నేటికీ పుంజుకోలేదు. గతంలో చేసిన వర్కుల మినహా ప్రస్తుతం ఏ మాత్రం పురోగతి లేదు.



రామాయపట్నం పోర్టు నిర్మాణ తీరు (ఫైల్)

అసలెప్పటికి పూర్తవుతుందో..?

వాస్తవానికి డిసెంబర్, 2023 నాటికే వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలని నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. తదనుగుణంగా అన్ని చర్యలు చేపట్టారు. అయితే ప్రస్తుత ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే మరో నాలుగేళ్లకైనా నిర్మాణం పూర్తవుతుందాననే అనుమానం తలెత్తుతోంది.

ఉన్నతాశయంతో..

తీర ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఉలవపాడు మండలంలోని రామాయపట్నం వద్ద రూ.3736 కోట్ల అంచనాతో పోర్టు నిర్మాణానికి గత ప్రభుత్వంలో పునాది రాయి పడింది. 850.79 ఎకరాల్లో పనులకు 2022, జూలై 20న నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణ పనులను అరబిందో సంస్థ వాయువేగంతో 70 శాతం మేర చేసింది. 18 నెలల్లోనే వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు సాగాయి. డిసెంబర్, 2023 నాటికి మొదటి వాణిజ్య నౌకను నిలపాలనే లక్ష్యంతో సర్కార్ అడుగులేసింది. అయితే ఆపై 2024 సాధారణ ఎన్నికల హడావుడి, కోడ్ అమల్లోకి రావడంతో అది సాధ్యపడలేదు.

ప్రస్తుతం.. గ్రహణం

గతేడాది జూన్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతోనే పోర్టు నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. అధికారం చేజిక్కించుకున్న వెంటనే కాంట్రాక్ట్ సంస్థ అరబిందోను తొలగించింది. తదనంతరం దాదాపు ఆర్నెల్ల పాటు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆపై నవయుగ కంపెనీకి నిర్మాణ బాధ్యతను అప్పగించారు. అయితే అప్పటికే పాత సిబ్బందిని తొలగించడం.. కార్మికులు, భారీ యంత్రాలను సమకూర్చడంలో చోటుచేసుకున్న జాప్యంతో పనులు మరింత ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్నా, అవి నామమాత్రమే. గతంలో చేపట్టిన బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణ పనులను అరకొరగా జరుపుతున్నారు. కీలకమైన డ్రెడ్జింగ్, బెర్తుల నిర్మాణం ఇంకా ప్రారంభమే కాలేదు.

ప్రస్తుత పరిస్థితి..

ఒక బెర్తు నిర్మాణం పూర్తి కాగా, మిగిలిన మూడు బెర్తులతో పాటు, సముద్ర లోతును పెంచే డ్రెడ్జింగ్ పనులు జరగాల్సి ఉంది. గతేడాది ఏప్రిల్ నాటికి మొదటి దశ పనులను పూర్తి చేసి అందుబాటులో తీసుకు రావాలని నాటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంకల్పించినా, ప్రస్తుత సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఫలితంగా రామాయపట్నం పోర్టు ఎప్పటికి పూర్తవుతుందో ఎవరికీ అంతుచిక్కడంలేదు.

మొదటి దశ ఎప్పుడో..?



గతంలోనే పూర్తయిన మొదటి బెర్తు

రామాయపట్నం పోర్టు మొదటి దశలో భాగంగా 34.04 ఎమ్మెమ్టీపీఏ (మిలియన్ మెట్రిక్ టన్స్ పర్ ఆనమ్) కార్గో సామర్థ్యంతో నాలుగు బెర్తులను నిర్మించాల్సి ఉంది. వీటిలో రెండు జనరల్, ఒకటి కోల్, మరొకటి మల్టీ పర్పస్‌కు సంబంధించనవి. సముద్రంలో వచ్చే ఆటుపోట్లు, తుఫాన్లను తట్టుకునేలా సౌత్, నార్త్ బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిని నీటి ఉపరితలం నుంచి మూడు మీటర్ల ఎత్తు, 100 మీటర్ల వెడల్పుతో పెద్ద బండరాళ్లతో నిర్మించారు. ఇందులో సౌత్ బ్రేక్ వాటర్ ఫీడర్ 3.7.. నార్త్ బ్రేక్ వాటర్ ఫీడర్ 1.73 కిలోమీటర్ల మేర పనులను పూర్తి చేశారు. వీటి మధ్యలోనే బెర్తులనూ నిర్మిస్తున్నారు. లక్ష టన్నుల సామర్థ్యం గల భారీ నౌకలు నిలిచేందుకు వీలుగా సముద్ర లోతును 16 మీటర్ల వరకు గతంలోనే డ్రెడ్జింగ్ చేశారు. బల్క్ బెర్తును నిర్మించి, 2023 డిసెంబర్ నాటికే మొదటి వాణిజ్య నౌకను నిలపాలనే లక్ష్యంతో పనులు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యే నాటికే మొదటి దశలో కీలకమైనవన్నీ పూర్తయ్యాయి. ఆపై సర్కార్ నిర్లిప్త ధోరణితో ఏ మాత్రం పురోగతి కనిపించడంలేదు.

అవినీతి తప్ప అభివృద్ధేదీ..?

- ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: రాష్ట్రంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని.. సర్వేపల్లిలో సోమిరెడ్డి, ఆయన కుమారుడు దోచుకుతింటూ బిజీగా గడుపుతున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పొదలకూరు మండలం మహ్మదాపురంలో గురువారం ఆయన పర్యటించారు. ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడంలేదనే విషయాన్ని ఆయన దృష్టికి రైతులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించకపోగా.. కనీసం ఒక్క బస్తా యూరియా లభ్యం కావడంలేదని ఆరోపించారు. రీ వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగుల పింఛన్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఇళ్లపై విద్యుత్ వైర్లు వెళ్తే వాటిని తొలగించి కొత్త లైన్లు వేసేందుకు తమ ప్రభుత్వ హయాంలో నిధులను మంజూరు చేస్తే, వాటినీ ప్రభుత్వం నిలిపేసిందని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధి చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్తున్నారే తప్ప, హామీలను నెరవేర్చడంలేదని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రైతులకు యూరియా సమృద్ధిగా లభించిన అంశాన్ని గుర్తుచేశారు.



రైతులతో మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మాట్లాడితే పోలీస్ కేసులు..

ప్రభుత్వాన్ని విమర్శించినా.. వ్యతిరేకంగా పోస్టులు పెట్టినా పోలీస్ కేసులు పెడుతున్నారని కాకాణి ఆరోపించారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసే అధికారులెవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలెప్పుడొచ్చినా, తమ పార్టీ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తామెలా ఉన్నాం.. ప్రస్తుతం ఎలా ఉన్నామనే అంశాలను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని చెప్పారు. అన్నదాత పోరుకు వచ్చిన స్పందనే దీనికి నిదర్శనమన్నారు. ఇటీవల మృతి చెందిన వీరాస్వామి కుటుంబీకులకు పరామర్శించారు. సొసైటీ మాజీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కరిపరెడ్డి కృష్ణారెడ్డి, నేతలు అశోక్‌కుమార్ రెడ్డి, మాలకొండారెడ్డి, శ్రీహరి, తిరుపాల్‌రెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్నా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏ సమయంలోనైనా దిగువకు నీటి విడుదల
- 72 టీఎంసీలకు చేరువలో సోమశిల

సోమశిల: సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యానికి చేరుకోనున్న నేపథ్యంలో దిగువ భాగంలో ఉండే పెన్నా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయవర్ధన్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రవాహంతో జలాశయం 71.430 టీఎంసీలకు చేరుకుందని, రానున్న రెండు రోజుల్లో మరికొంత చేరే అవకాశం ఉన్న క్రమంలో క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని ఎప్పుడైనా విడుదల చేయొచ్చన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాగా జలాశయం నుంచి ఉత్తర కాలువకు 400, కండలేరు కాలువకు 9250, పవర్ టన్నెల్ ద్వారా పెన్నా డెల్టాకు 1850 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని ఈఈ శ్రీనివాసులు తెలిపారు.



సోమశిల జలాశయంలో నిల్వ ఉన్న నీరు

సీజనల్ హాస్టళ్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): జిల్లాలో వలస విద్యార్థులు ఎక్కువగా ఉన్న మండలాల్లో సీజనల్ హాస్టళ్లను నిర్వహించేందుకు ఎన్జీఓ, సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఈ నెల 15లోపు సమర్పించాలని సూచించారు.

గ్రామసభ తీర్మానాన్ని అమలు చేయాలి

కందుకూరు: ఇండోసోల్ కంపెనీ కోసం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తూ కరేడులో నిర్వహించిన గ్రామసభలో ఏకగ్రీవంగా చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని, గ్రామాలను ఎట్టి పరిస్థితుల్లో ఖాళీ చేసేందుకు తాము సిద్ధంగా లేమని కరేడు పంచాయతీ పరిధిలోని ఉప్పరపాళెం దళితులు పేర్కొన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీకి వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. కరేడు పంచాయతీలో 8348 ఎకరాలు, ఉప్పరపాళెం, రామకృష్ణాపురం, పొట్టిటిగుంట గిరిజన సంఘాలను ఖాళీ చేయాలని ఇప్పటికే నోటిఫికేషన్‌ను ఇచ్చారని తెలిపారు. దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని.. భూములు, ఇళ్లను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని తేల్చిచెప్పారు. ఇంటింటికీ పంచాయతీ కార్యదర్శి వచ్చి కొలతలు తీయడంతో పాటు అకౌంట్ నంబర్లనూ సేకరిస్తున్నారని చెప్పారు. బలవంతపు భూసేకరణను నిలిపేయాలని కోరారు. అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అయితే పచ్చని పంటలు పండే పొలాలను తీసుకోవడం తగదన్నారు. గ్రామంలోని రైతులు, ఉద్యమ సంఘాల నేతలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. తొలుత ఆందోళనను చేపట్టారు. ఉప్పరపాళెం గ్రామస్తులు గంజి చినకోటేశ్వరరావు, ప్రసాద్, అభిషేక్, శ్రీను, కొట్టే మాలకొండయ్య, రమణమ్మ, పిచ్చమ్మ, ప్రజా సంఘాల నేతలు కుమార్, వెంకటేశ్వర్లు, వీసం విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉప్పరపాళెం వాసుల ఆందోళన

మైనింగ్ అధికారుల దాడులు

కావలి (జలదంకి): కావలి మండలంలోని తాళ్లపాళెం చెరువులో గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలను మైనింగ్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తాళ్లపాళెం చెరువులో గ్రావెల్‌ను తెలుగు తమ్ముళ్లు కొంతకాలంగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. స్పందించిన మైనింగ్ అధికారులు దాడులు జరిపి జేసీబీతో పాటు మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వీటిని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

కండలేరులో 43.81 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారానికి 43.81 టీఎంసీ నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి 8900 క్యూసెక్కుల నీరొస్తోందని చెప్పారు. కండలేరు నుంచి సత్యసాయి గంగకు 1130, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 40, హైలెవల్‌కు 100, మొదటి బ్రాంచ్ కాలువలకు 60 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో..

- వేర్వేరు చోట్ల ఇద్దరి మృతి

అడవిలో..


రాము మృతదేహం

సంగం: మండలంలోని సంగం చెక్‌పోస్టు సెంటర్ సమీపంలోని అడవిలో చల్లా రాము (41) అనే వ్యక్తి గురువారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పంచనామాకు తరలించారు. ఆటో తోలుకుని జీవించే రాము ఎలా చనిపోయాడో అనే వివరాలు ఇంకా తెలియరాలేదు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. రాముకు భార్య సీతారావమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దుత్తలూరు మండలంలో..

దుత్తలూరు: మండలంలోని వెంకటంపేట గ్రామ బీసీ కాలనీకి చెందిన పఠాన్ సనా (17) అనే బాలిక అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పఠాన్ ఖాదర్‌బాషా, నాజున్నీసాలకు ఇద్దరు కుమార్తెలు. ఖాదర్ బాషా పొట్టకూటి కోసం గల్ఫ్‌కు వెళ్లి ఇటీవల సొంతూరికి వచ్చాడు. పెద్ద కుమార్తె సనా ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు చదివి ఇంట్లోనే ఉంటోంది. అనారోగ్యంగా ఉండటంతో గురువారం భార్యాభర్తలు ఉదయగిరి వైద్యశాలకు వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికెళ్లి చూడగా కుమార్తె అపస్మారక స్థితిలో ఉంది. వెంటనే ఆటోలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. సనా మృతి అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు.

కేసుల నమోదు సరికాదు



మనది ప్రజాస్వామ్య దేశం. పత్రికలకు సంపూర్ణ స్వేచ్ఛ ఉంది. అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి వారధిలా మీడియా ఉంటుంది. ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చి ప్రభుత్వానికి చురుకు కలిగేలా పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా వ్యవహరించడం సహజం. అయితే మన రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగేలా ప్రభుత్వం వ్యవహరించడం, సాక్షి పత్రికపై కొన్ని ప్రాంతాల్లో కేసులు నమోదు చేయడం సరికాదు. ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం లాంటిదే.

– నందా ఓబులేసు, న్యాయవాది, ఆత్మకూరు



పత్రికా స్వేచ్ఛను హరించడమే..



పత్రికలపై దాడి చేయడం వాటి స్వేచ్ఛను హరించడమే. ప్రభుత్వాలకు నచ్చిన విధంగా మీడియా పనిచేయదు. ప్రజా సమస్యలపై గళమెత్తిన సందర్భాల్లో ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించి సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. అలా కాకుండా సాక్షి పత్రికపై పోలీసు కేసులను పెట్టడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలిపెట్టు అవుతుంది. ఇకనైనా సాక్షిపై పెడుతున్న కేసులను ఆపివేయాల్సిన అవసరం ఉంది.

– సునీల్, జిల్లా అధ్యక్షుడు, పీడీఎస్‌యూ

వర్షం.. రైతులకు తీరని నష్టం

నేలవాలిన వరి

- పరుగులు తీసిన అన్నదాతలు
- కొనుగోలు కేంద్రాలు పెట్టాలని వినతి

ఎడగారుకు యూరియా కొరత, పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులతో అన్నదాతలు ఆవేదనలో ఉన్నారు. దీనికితోడు బుధవారం రాత్రి ఒక్కసారిగా కురిసిన వర్షం వారిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టింది. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం, చేజర్ల మండలాల్లో వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సంగం: వర్షంతో సంగం మండలంలోని దువ్వూరు, జెండాదిబ్బ, అన్నారెడ్డిపాళెం, తలుపూరుపాడు, పెరమన, కొరిమెర్ల, జంగాలకండ్రిక, సంగం రెవెన్యూ గ్రామాల్లో 2 వేల ఎకరాలకు పైగా, చేజర్ల మండలంలో 200 ఎకరాలకు పైగా వరి నేలవాలింది. చేతికొచ్చిన పంట ఇలా కావడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

పరుగులు పెట్టిన అన్నదాతలు

రాత్రి సమయంలో ఒక్కసారిగా వర్షం కురవడంతో అన్నదాతలు తమ పొలాల వైపు పరుగులు పెట్టారు. ఇప్పటికే కోతలు ప్రారంభమై ఉండటంతో పలుచోట్ల ధాన్యాన్ని గుట్టలుగా పోసి అమ్మకాల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షంతో నీరు చేరుతుందనే భయంతో ధాన్యం వద్దకు వెళ్లి టార్పాలిన్ పట్టలు కప్పారు.

ఆందోళన చెందుతూ..

వర్షంతో వరిపైరు నేలవాలింది. దీంతో ఏం చేయాలో అర్థంగాక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కోసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. దళారులు పుట్టిని కేవలం రూ.14 వేలకే కొనుగోలు చేస్తున్నారు. వరి నేలవాలడంతో ధాన్యం పచ్చగింజ పడ్డాయని సాకు చెప్పి దళారులు మరింత దోపిడీకి పాల్పడి ధరలు తగ్గిస్తారన్న ఆందోళన నెలకొంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


బుచ్చిరెడ్డిపాళెం పెనుబల్లి గ్రామంలో నేలవాలిన వరి

ఏం చేయాలో..



జంగాలకండ్రికలో ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాను. బుధవారం రాత్రి కురిసిన వర్షంతో పంట పూర్తిగా నేలవాలింది. వరి కోత ఉంది. దీంతో ఎలా కోయాలో అర్థం కావడం లేదు. రెండు రోజులు ఇలాగే ఉంటే ధాన్యం మొలకెత్తే ప్రమాదం ఉంది.

– నెల్లూరు శీనయ్య, జంగాలకండ్రిక

కొనుగోలు కేంద్రాలు పెట్టాలి



నేను బుధవారం ఉదయం వరి కోత కోసి ఒడ్లు పొలం బయట నిల్వ చేశాను. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఒడ్లు తడిసిపోయాయి. ఇప్పటికే దళారులు దిగుబడి రేటును తగ్గించారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

– నక్కా సుధాకర్, దువ్వూరు

గిట్టుబాటు ధర కల్పించాలి



ఎంతో శ్రమించి వరిపంట సాగు చేశాం. అన్ని ధరలు పెరిగాయి. గిట్టుబాటు ధర కల్పిస్తే మేలు. లేకుంటే నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– రామయ్య, దువ్వూరు

పాపం అన్నదాతలు


పొట్టేపాళెం సమీపంలో పంట పొలాల్లో వర్షపునీరు


తడిసిన ధాన్యాన్ని గోతాల్లో నింపుతూ..

నెల్లూరు(పొగతోట): వర్షంతో బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి మండలం తదితర మండలాల్లో వరి నేలవాలింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అనేక ప్రాంతాల్లో వరికోతలు మొదలయ్యాయి. ధాన్యం తడిసిపోవడంతో ఆరబెట్టేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడ్డారు. నెల్లూరు పొట్టేపాళెం సమీపంలో పంట పొలాల్లోకి వర్షపునీరు చేరింది. ఇంకా వర్షాలు కురిస్తే తీవ్రస్థాయిలో నష్టపోయే ప్రమాదముంది.


దువ్వూరు వద్ద ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు


జంగాలకండ్రికలో ధాన్యంపై కప్పిన పట్ట

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలోని ఎర్రతోట ప్రాంతానికి చెందిన చిట్టూరి మాధవి (38) అనే వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. మాధవికి కావలి రూరల్ మండలం చలంచర్ల గ్రామానికి భాగ్యరావుతో వివాహమైంది. వారికి బీటెక్ పూర్తి చేసిన కుమార్తె, బీటెక్ చదువుతున్న కుమారుడు ఉన్నారు. కొన్ని సంవత్సరాలుగా మాధవి కలిగిరిలో ఉంటోంది. భాగ్యరావు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేస్తున్నాడు. కలిగిరి ఎస్సీ కాలనీకి చెందిన గోసాల మధు అనే యువకుడితో మాధవి సన్నిహితంగా ఉంటోంది. ఈ విషయమై అతని కుటుంబంలో వివాదాలున్నాయి.


మాధవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బుధవారం రాత్రి మధు కుటుంబ సభ్యులు, బంధువులు మాధవి ఇంటికెళ్లి ఒంటరిగా ఉన్న ఆమెను తీవ్రంగా కొట్టారు. ఇంటి యజమానురాలు వారించినా వినిపించుకోకుండా దాడి చేశారు. తల్లిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న కుమారుడు మణిదీప్ గురువారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. ఆరుబయట ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మనస్తాపానికి గురైన మాధవి వంట గదిలోకి తాడుతో ఉరేసుంది. కుమారుడు గుర్తించి కత్తితో తాడును కత్తిరించి రిక్షాలో తల్లిని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పీహెచ్‌సీ వద్దకు తరలించారు. మాధవి కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆమెపై దాడి చేసి మృతికి కారణమైన మధుతో పాటు అతడి కుటుంబంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని ఎస్సై ఉమాశంకర్ పరిశీలించారు. మధు, అతడి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కబడ్డీ జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లా జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలను ఈనెల 13వ తేదీ నిర్వహిస్తున్నట్లు నెల్లూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు హరీష్, కార్యదర్శి గంటా సతీష్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. బాలుర విభాగంలో 75 కేజీల్లోపు, బాలికల విభాగంలో 65 కేజీల్లోపు ఉండాలన్నారు. వయసు 20 సంవత్సరాల్లోపు ఉండాలని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22వ తేదీ నుంచి విజయవాడలోని గొల్లపూడిలో జరిగే 51వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.40
సన్నవి	రూ.25
పండ్లు	రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.136	స్కిన్‌లెస్	
లేయర్ :	రూ.123	చికెన్ :	రూ.266
బ్రాయిలర్ చికెన్ :	రూ.242	లేయర్ చికెన్:	రూ.210